
**పద్దెమిదేళ్ళకే** గిరిజ బుర్రనిండా ఆదర్శాలు, ఆలోచనలు పేరుకు పోవటానికి ఆమె అభిమాన రచయిత్రి శాంతాదేవి కారకురాలు.

శాంతాదేవి ఎన్నో నవలలు, కథలు వ్రాసినా—అన్నిట్లోనూ ప్రధానంగా కనిపించే ఇతివృత్తం స్త్రీ పక్షపాతం. చెప్పే విషయం ఒకటే అయినా, చెప్పే విధానంలో ఆమెకు ఒక ప్రత్యేకత ఉంది. హృదయాలను పట్టివేసే ఆ శైలే ఆమెను ప్రముఖ రచయిత్రిని చేసింది.

అయితే, శాంతాదేవి తాను రాజారామ్ మోహన్‌రాయ్, వీరేశలింగం పంతులు, శరత్‌బాబు, చలం ప్రభృతుల వారసురాలి ననుకొంటుంది. సంస్కర్త నని చెప్పుకొంటూ ఉంటుంది. ఒక ప్రముఖ పత్రికలో వారం వారం ఆమె పాఠకుల ప్రశ్నలకు ఇచ్చే సమాధానాలు అందుకు సాధనాలు.



# అడవిగాచిన వెన్నెల

**-కప్పగంతుల మల్లికార్జున రావు**

గిరిజ శాంతాదేవికి వారసురాలు కావాలనుకొంది. ఆమె పద్ధతిలో, శైలిలో చేసిన రచనలు కాస్తా తిరిగి రావటంతో నిరాశ చెందింది. తన ఆలోచనల్ని ఏదో రూపంలో వ్యక్తం చేయనిదే ఆమెకు నిద్రపట్టలేదు. అందుచేత ఆమె ఉత్తరాల రచయిత్రి అయింది. ఒకటి రెండు ఉత్తరాలు కాలేజీలో స్నేహితురాళ్ళు పొగడటంతో తను ఒక మహారచయిత్రి అయినట్లే పొంగిపోయింది. ఇప్పుడు ఆమె వ్రాసిన ఉత్తరం ఏదో పత్రికలో వారానికి ఒకటన్నా ప్రచురింపబడవలసిందే !

అప్పుడెప్పుడో శాంతాదేవి సమాధానా లిచ్చే శీర్షికకు గిరిజ ప్రశ్నలు పంపినా, ఇప్పుడు ఆమె అది తన స్థాయికి తక్కువ అనుకొంటూంది. రేడియోలో, పత్రికల్లో వచ్చే తన ఉత్తరాల ద్వారా తను ఒక పెద్ద విమర్శకురా లయిపోయినట్లు భావిస్తూ ఉంటుం దామె.

ఆలాంటి గిరిజకు ఒక పెద్ద సమస్య వచ్చిపడింది.

గిరిజ తండ్రి రామ్మూర్తి కాస్తంత పాతకాలం మనిషి. ఉన్నంతలో సంసారాన్ని గుట్టుగా ఈడ్చుకుపోయే తత్త్వం. ముందు చూపుతో గిరిజ పుట్టిన దగ్గరినుంచీ, ఆమె పెళ్ళికని కొంత డబ్బు కూడబెట్టాడు. ఇప్పటి కది దాదాపు పదివేలయింది. ఆ డబ్బుతో గిరిజకు పెళ్ళి చేయాలని సంకల్పించి సంబంధాలు చూడసాగాడు.

కట్నం ఇచ్చి భర్తను కొనుక్కోవటం గిరిజ ఆదర్శానికి విరుద్ధం. అలా డబ్బుకు అమ్ముడుపోయే మగవాడేం మగవాడు? ఇలాంటి ఆలోచనలు గిరిజ బుర్రలో ఎన్నో !

"ఇచ్చేవాళ్ళం మేము. పుచ్చుకొనే వారు వాళ్ళు. మధ్య నీ కెందుకమ్మా ఇదంతా?"

"నీకేమన్నా పిచ్చా ఏమిటే? కట్నాలు ఇవ్వకుండా పెళ్ళికొడుకులు వస్తారా?"

తలిదండ్రుల పోరు భరించలేక గిరిజ స్వయంగా అలాంటివాడిని పత్రికలో వెతికి పట్టుకొంది. ఉత్తరాల ద్వారా ఆదర్శాలు తెలుసుకొని ప్రేమించి పారేసింది.

పెళ్ళి చూపు లయ్యాయి. పెళ్ళికొడుకు తండ్రి కూడా కట్నాలు తీసుకోమని చెప్పాడు. గిరిజ ప్రయోజకత్వానికి అంతా సంతోషిస్తూ ఉండగా, పెళ్ళికొడుకు తల్లి లాంఛనాల విషయం ఎత్తింది. తీరా వాళ్ళడిగిన లాంఛనాల ఖరీదు లెక్కవేస్తే గిరిజ పెళ్ళికని కూడబెట్టిన పదివేలూ చాలేలా కనిపించ లేదు.

గిరిజ పెళ్ళికొడుకు వైపు చూచింది. అతను ముందు నవ్వాడు. గిరిజ కళ్ళలో కోపాన్ని కనిపెట్టి తలవంచుకొన్నాడు. గిరిజకు అసహ్య మేసింది. 'ఛీ ! మోసగాడు, బానిస!' అనుకొంది.

మొత్తంమీద ఇరుపక్షాల పెద్దవాళ్ళు, లాంఛనాల బేరాల్ని అంగీకార యోగ్యంగా ముగించారు.

"అమ్మా ! కుర్రవాడు బాగున్నాడు. ఉద్యోగం చేసుకొంటున్నాడు. ఆపాటి లాంఛనాలన్నా ఇవ్వకపోతే ఏం బాగుంటుంది? అనవసరపు గొడవలకి పెట్టక పెళ్ళి చేసుకొని ఒక ఇంటిదానివి కా. మాకు ఒక భారం తీరుతుంది."

గిరిజకు అతను నచ్చాడు. పెళ్ళి చేసుకోవాలని కోరికగానూ ఉంది. అయితే తను కట్నాలకు వ్యతిరేకంగా ఏదో వంకతో ఎన్నో ఉత్తరాలు వ్రాసింది. అవి పత్రికల్లో ప్రచురింపబడి ఉన్నాయి. కట్నం ఇచ్చి పెళ్ళి చేసుకొంటే రేపు స్నేహితురాళ్ళు నవ్వరూ?

ఎటూ పాలుపోక, గిరిజ తన స్థితిని వివరిస్తూ, తన అభిమాన రచయిత్రి శాంతాదేవిని సలహా కోరుతూ ఉత్తరం వ్రాసింది. ఆమె సలహా ప్రకారం నడవటానికి నిశ్చయించుకొంది.

• • • •

పత్రిక ఆఫీసునుంచి వచ్చిన ఉత్తరాల గుట్టను చూచి నవ్వుకొంది శాంతాదేవి. తన శీర్షికకు ఉన్నది ఒక్క పేజీ. వచ్చే ఉత్తరాల సంఖ్య వారం వారం పెరిగిపోతూంది. 'దేశంలో అజ్ఞానుల సంఖ్య పెరిగిపోతున్న దనటానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి?

"ఒరేయ్ బుజ్జీ !" అని పిలవటమే తడవుగా బుజ్జి పరుగెత్తుకొంటూ వచ్చింది. బుజ్జి శాంతాదేవి పెంపుడు కుక్క. అలవాటుగా గుట్ట ఉత్తరాలలో నుంచి పది ఉత్తరాలను నోటితో లీసి శాంతాదేవికి అందించింది. మిగిలినవి బాయిలర్ దగ్గరికి చేర్చింది.

మొదటి ఉత్తరం చదవటానికి తెరిచి ఉలిక్కిపడింది శాంతాదేవి. ఒక మినీ కథకు మించి ఉంది అది. పేరు చూచింది గిరిజ !

గిరిజ పేరు శాంతాదేవికి గుర్తు ఉంది. పూర్వం ఆమె ఉత్తరాలకు కొన్నింటికి జవాబిచ్చింది. ఈమధ్య ఆమె వ్రాస్తున్న ఉత్తరాలూ చూస్తూంది. అందుచేత ఆమె ఉత్తరాన్ని ఆసాంతం తీరిక చేసుకొని చదవక తప్పలేదు.

ఒకరి రచనలమీద ఉత్తరాల ద్వారా ఘాటైన అభిప్రాయాలు వెలిబుచ్చే గిరిజ కనిపించలేదు ఆ ఉత్తరంలో. పెళ్ళి కావలసిన ఒక ఆడపిల్ల కనిపించింది. 'పిచ్చి పిచ్చి ఆలోచనలకు పోక నిక్షేపంగా పెళ్ళి చేసుకొని సుఖపడు, పిచ్చీ !' అని సమాధానం వ్రాయబోయి ఆగింది. లోకరీతి తెలిసిన అనుభవజ్ఞురాలైన ఒక స్త్రీ మరొక యువతికిచ్చే సమాధానం అది. కానీ, తను రచయిత్రి!

సమాజ సంస్కరణకు, స్త్రీ జనోద్ధరణకు కంకణం కట్టుకొన్న రచయిత్రి సామాన్య స్త్రీలా సమాధానం ఇస్తే తన ఇమేజీ ఏంకాను?

"చదువుకొంటున్నావు. ఆలోచించే శక్తి ఉంది. రేపు ఉద్యోగం చేసుకొంటే ఆర్థిక స్వాతంత్ర్యం వస్తుంది. కట్నం ఇచ్చి అల్లుణ్ణి కొనుక్కొనే బదులు, ఆ డబ్బు నీ నాన్ననుంచి పుచ్చుకొని హాయిగా ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేసుకో. నీలాంటి యువతులలోలాగా ఇప్పుడిప్పుడే యువకులలోనూ సామాజిక చైతన్యం వస్తూంది. నీ మనసుకు నచ్చినవాడు, నీ ఆదర్శాలను మెచ్చేవాడు ఎప్పుడో దొరక్కపోడు. నీలాంటి వర్ధమాన రచయిత్రులు కూడా ఇలా మార్కెట్‌లో పశువుల్లాగా మొగుళ్ళను కొనుక్కోవటం మొదలుపెడితే మార్పు ఎప్పటికి వచ్చేను?" ఇలా సమాధానం వ్రాసేముందు శాంతాదేవి మనసు చాలా సేపు మథనపడింది.

మార్కెట్లో పదిమందిని చూచే యువకులకు ఒక సాధారణ యువతి నచ్చటమే, ఆకాశ కుసుమాన్ని సిగలో దోపుకొన్నంత సంబరం. ఇక కట్నాల బేరాలు కూడా కుదరటం అంటే సూర్యమండలం చేరుకొన్నట్లే ! అలాంటి స్థితిలో, అన్నీ కుదిరిపోయిన వివాహాన్ని, గిరిజ సంసార సుఖాన్ని తాను చేజేతులా కాకుండా చేయడంలేదుకదా? తప్పేముంది? ఆదర్శాల చేతిలో బందీ తాను!

పోనీ, అసలు జవాబివ్వకపోతే? గిరిజ వూరుకోదే !

• • • •

పత్రికలో శాంతాదేవి ఇచ్చిన సలహా చదివి నీరసించిపోయింది గిరిజ. ఒక క్షణం మనసును నిరాశా నిస్పృహలు ఆవరించాయి. అంతలోనే ఆ సమాధానం ఇచ్చిన ప్రేరణతో ఆదర్శపు ముసుగును ధరించింది. పెళ్ళి చేసుకోనని ప్రకటించింది. ఎప్పటికైనా కట్న కానుకాదులను ఆశించకుండా, కేవలం తనను, తన ఆదర్శాలను, ప్రతిభను గుర్తించిన వాడినే వివాహం చేసుకొంటానని కూడా ప్రకటించింది.

స్నేహితురాళ్ళు ఆమె ఆచరణశీలత్వాన్ని ఆకాశానికి ఎత్తేశారు. అలా అందా పొగుడుతూంటే ఆమె ఎదిగింది. తన అనుభవాన్ని ఒక వ్యాసరూపంలో వ్రాసింది. అది ఒక పత్రికలో ప్రచురింపబడి చాలామంది ప్రశంసల నందుకొంది.

డిగ్రీ చదువు అయిపోయింది. తన ఆదర్శాలను మెచ్చి తనను పెళ్ళి చేసుకొనే యువకుడికోసం గిరిజ అన్వేషిస్తూంది. ఆదర్శాలను అంతా మెచ్చుకొంటారు. తనతో పరిచయాలు పెంచుకొంటారు. కాని, పెళ్ళి అనేసరికి పెచ్చిదాన్ని చూచినట్లు చూచి వెళ్ళిపోతారు. శాంతాదేవి చెప్పిన యువకులు ఎక్కడ ఉన్నారు? ఎక్కడా కనబడరేం !

గిరిజ ధోరణితో విసిగిపోయిన తండ్రి, సంబంధాలు చూడటం మానుకొన్నాడు. ఆమె వివాహానికని కూడబెట్టిన డబ్బు కుటుంబ అవసరానికి వాడుకొన్నాడు.

చివరిగా గిరిజ ఉద్యోగం సంపాదించింది. గుమాస్తా అయితేనేం కాక— ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చింది !

"అమ్మాయ్ ! నువ్వు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సంపాదించుకొన్నావు. సంతోషం. నీ డబ్బు నాకు కానీ ఇవ్వవద్దు. బాంకులో వేసుకో. ఏనాటికైనా పెళ్ళి చేసుకోవాలనుకొంటే ఉపయోగిస్తుంది. ఆనాడుమాత్రం నన్ను డబ్బు అడగవద్దు."

తండ్రి మాటలకు నవ్వుకొంది గిరిజ. తను కట్నం ఇచ్చి పెళ్ళి చేసుకోవటమా? నాన్సెన్స్ !

రోజులు గడుస్తూంటే వయసు పైబడసాగింది. కోరికలు చంపుకుని తినసాగాయి. ఎక్కడ చూసినా జంటలు ! వారి మొహాల్లో సంతోషం !

వరాన్వేషణ తనే చేసుకోసాగింది. ఆఫీసులో తోటి గుమాస్తాలకు చాలా మందికి పెళ్ళి అయింది. పెళ్ళికాని వారిని కదిలిస్తే కులాలను గురించి మాట్లాడతారు. కట్న కానుకలు అడుగుతారు.

ప్రసిద్ధ రచయితలకు ఉత్తరాలు వ్రాసింది. వారి వివరాలు తెలుసుకొంది.

రచనల్నిబట్టి ఆమె యువకు లనుకొన్న వాళ్ళందరికీ పెళ్ళిళ్ళయ్యాయి. పెళ్ళికాని రచయితల్లో కొంతమంది అలవాట్లు ఆమెకు నచ్చలేదు. కొందరి రూపాలు నచ్చలేదు. అవి ఎలాగో ఒకలాగ సరిపుచ్చుకొందామని నిర్ణయించుకొని అసలు విషయాన్ని కదిపితే, అంతా ఆమెను హేళన చేశారు. ఆమె కథ

భాగ్యలక్ష్మి
కనకవర్షం కురిపిస్తుంది

మొత్తము బహుమతుల విలువ:
రూ. 9,90,000
బహుమతుల మొత్తము : 33,351
3 సిరీసులకు చేర్చి:

| | | |
|---|---|---|
| 3 మొదటి బహుమతులు | రూ. | 1,00,000/- ఒక్కొక్కటి |
| 6 రెండవ బహుమతులు | రూ. | 20,000/- ఒక్కొక్కటి |
| 12 మూడవ బహుమతులు | రూ. | 5,000/- ఒక్కొక్కటి |
| 30 నాల్గవ బహుమతులు | రూ. | 1,000/- ఒక్కొక్కటి |
| 300 ఐదవ బహుమతులు | రూ. | 100/- ఒక్కొక్కటి |
| 3,000 ఆరవ బహుమతులు | రూ. | 50/- ఒక్కొక్కటి |
| 30,000 ఏడవ బహుమతులు | రూ. | 10/- ఒక్కొక్కటి |

ప్రతి 100 టికెట్లకు 1 బహుమతి

ఏడవ డ్రా:
12-3-81
తిరుపతిలో



ASP/B/814/TEL

ఆంధ్రప్రదేశ్
ప్రభుత్వ లాటరీ

టికెట్ ఖరీదు రు 1/-
త్వరపడండి! నేడే మీ టికెట్ కొనండి

బహుమతులు
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముచే
గ్యారంటీ చేయబడినవి.

ముద్రాపకులు: ఆంధ్రప్రదేశ్
స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ లి.
5-10-174, ఫతేమైదాన్ రోడ్,
హైదరాబాదు-500 004

డైరెక్టరు, స్మాల్ సేవింగ్స్
అండ్ స్టేట్ లాటరీస్ ఆఫ్
ఆం.ప్ర. చే జారీచేయబడినది.

విని ఎవరూ సానుభూతి అయినా చూపలేదు.

"అమ్మా! ఉత్తరాల రచయిత్రు లందరినీ పెళ్ళిళ్ళు చేసుకొంటే మేము గోపికా కృష్ణులమయి చస్తాం. పెళ్ళి సంగతి మినహా మరేదైనా మాట్లాడు."

కాలం గడిచేకొద్దీ తన కసలు పెళ్ళికాదేమోనన్న భయం పట్టుకొంది గిరిజకు. ఎవరినో ఒకరిని, ఎలాగో ఒకలాగ పెళ్ళి చేసుకోవాలన్న ఆరాటం పెరిగింది. వెనక కాదని తిరస్కరించిన అతనికి జాబు వ్రాసింది కూడా. అతనికి పెళ్ళి అయింది. కుటుంబ నియంత్రణాన్ని కూడా అమలు జరిపాడు. శాంతాదేవి ఇచ్చిన సలహాపై కోపం వచ్చింది!

అలా ఉండగా గిరిజ పనిచేసే ఆఫీసుకు కొత్త ఆఫీసరు వచ్చాడు. అతడిని చూడగానే, శాంతాదేవి ఎప్పుడో ఒకప్పుడు తనకు దొరుకుతాడన్న యువకుడు అతడేనని అనిపించింది గిరిజకు. అతని పేరు ప్రేమ్‌చంద్.

ప్రేమ్‌చంద్ ఆఫీసరైనా, అభ్యుదయ భావాలు ఉన్నవాడు. తన క్రింది వాళ్ళతో కలుపుగోలుగా ఉండి సరదాగా మాట్లాడుతాడు. అనవసరపు డాంబికాలు లేవు.

అతని మాటలు విన్నాక అతను తన ఆదర్శాలకు దగ్గరగా ఉన్నాడని భావించింది గిరిజ. పరిచయం పెంచుకొంది. తప్పిపోయిన తన పెళ్ళి కథ కూడా చెప్పింది. శాంతాదేవి సలహాపైన తను పెళ్ళికాదన్నానని మాత్రం చెప్పలేదు.

"గుడ్! అభ్యుదయ పంథలో నడిచే ఆడపిల్లలంటే నా కిష్టం. మీ తెగింపుకు నా జోహారు."

ప్రేమ్‌చంద్ తనను పెళ్ళి చేసుకొన్నట్లే సంతోషించింది గిరిజ. తన ఉత్తరాల రచనల ఫైలు ఇచ్చింది. 'మీ అభిప్రాయాలు చాలా ఘాటుగా ఉన్నాయండీ" అన్నాడు చదివి.

ఇవన్నీ చదివి, తన కథ తెలుసుకొని, అతడే పెళ్ళి చేసుకోవటానికి ముందుకు వస్తాడని ఆశించింది. అతను ఆ పని చేయకపోవటంతో తనే ధైర్యం చేసి అడగటానికి నిశ్చయించుకొంది. అందుకు ముహూర్తం కూడా నిర్ణయించింది...

"మీరు నా పెళ్ళికి తప్పక రావాలి. అక్కడ మీ కో గొప్ప వ్యక్తిని పరిచయం చేస్తా" అన్నాడు ప్రేమ్‌చంద్ శుభలేఖ ఇస్తూ.

"మీ పెళ్ళా!" హతాశురాలై అంది గిరిజ.

"ఏం అలా అయిపోయారు? పెళ్ళి ఈ ఊళ్ళోనే. కాబోయే అత్తగారి ఊరు ఇది కాకపోయినా, మీలాంటివారు రావాలన్న కోరికతో ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. తప్పక వస్తారుగా?"

ప్రేమ్‌చంద్ పెళ్ళికి అందరితోపాటు వెళ్ళింది గిరిజ కూడా. అతను చాలా కట్నం తీసుకొంటున్నట్లు, మామగారు పెద్ద ఆఫీసరని అందరూ చెప్పుకోవటం విన్నది గిరిజ.

పెళ్ళి చాలా ఆర్భాటంగా జరిగింది. పెళ్ళికూతురికి బోలెడన్ని నగలు పెట్టారు తలిదండ్రులు. అల్లుడికీ చాలా లాంఛనాలు జరిపించారు.

"హల్లో గిరిజాదేవిగారూ! వచ్చారా? గుడ్! మీ కో గొప్ప వ్యక్తిని పరిచయం చేస్తానని చెప్పానుకదూ? రండి." పెళ్ళి కార్యక్రమం ముగిశాక ప్రేమ్‌చంద్ స్వయంగా వచ్చి పలుకరించి గిరిజను లోపలికి తీసుకువెళ్ళాడు.

"అత్తయ్యగారూ! ఈమె మా ఆఫీసులో గుమాస్తా. ఘాటైన భావాలుకల వ్యక్తి. పత్రికలకు ఉత్తరాలు వ్రాస్తూంటుంది. అవన్నీ చదవగానే నాకు మీరు గుర్తుకు వచ్చారు. పేరు గిరిజ! ఒక సాహసం చేసి, అంతా నిర్ణయమైన పెళ్ళిని కాదన్న అభ్యుదయ భావాలుకల యువతి."

గిరిజ ఆమెకు నమస్కరించింది. ఆమె నడివయసులో ఉన్న వ్యక్తి. పట్టు చీరె కట్టుకొంది. మొహాన రూపాయి వెడల్పున కుంకుమ బొట్టు. తలలో చామంతుల దండ. కాళ్ళకు పసుపు. పెద్ద ముత్తయిదువులా ఉంది.

"రా, అమ్మా! ఫలహారం చేశావా? భోజనం చేసిపోవాలి" అంది లాంఛనంగా.

గిరిజ ప్రేమ్‌చంద్‌వైపు చూసింది. గొప్ప వ్యక్తి అని అత్తగారిని పరిచయం చేస్తాడేం? ఈ పాతకాలం పెద్ద ముత్తయిదువులో ఏం గొప్ప ఉంది?

"ఈమె మా అత్తగారు. ప్రసిద్ధ రచయిత్రి—శాంతాదేవిగారు. మీరు మాట్లాడుకోండి" అంటూ ప్రేమ్‌చంద్ వెళ్ళిపోయాడు.

గిరిజ శాంతాదేవివైపు చూచింది. ఆ చూపులో శక్తికి మరొకరైతే మాడి మసి కావలసిందే!

కానీ, ప్రఖ్యాత రచయిత్రి శాంతాదేవి గిరిజ చూపును చూచి అదో విధంగా నవ్వింది. ఎదుటి వాళ్ళలోగల శక్తిని హరించే నవ్వు అది.

గిరిజ ఎన్నెన్నో అడగాలనుకొంది. కాని, ఏమీ మాట్లాడలేక, అసలు శాంతాదేవిముందు ఇక నిలవలేక, గిరుక్కున వెనక్కు తిరిగి బయటకి విసవిసా నడవసాగింది. అది చూచి ప్రేమ్‌చంద్ హడావుడిగా అత్తగారి వద్దకు వచ్చాడు.

"కంగారుపడకు, బాబూ! ఇతరుల రచనలమీద ఎరువు గొంతుతో అభిప్రాయాలు ప్రకటించటం తప్ప, స్వంత విషయాల్లో స్వంత ఆలోచనలు, నిర్ణయాలు లేని పిల్ల. ఎరువు గొంతు ఎప్పటికైనా మూగపోక తప్పుతుందా? పాపం! స్వంత గొంతు అయినా లేని పిచ్చిపిల్ల! ఎలా బ్రతుకుతుందో? అడవిగాచిన వెన్నెల ఆ పిల్ల ఆదర్శాలు!"

ఆమాట అంటున్నప్పుడు ప్రపంచంలో జాలి, కరుణ—అంతా శాంతాదేవి కంచు కంఠంలోనే ప్రతిధ్వనించాయి. ★


శ్రీ కవితా వారి నూతన ప్రచురణలు
ఆంధ్రుల అభిమాన రచయిత్రులు
డా॥ కె.వి. కృష్ణకుమారి, శ్రీమతి విమలారామం అపూర్వరచనలు

మంచుపూలు - డా॥ కె.వి. కృష్ణకుమారి 12·50
ఒకేసారి మూడు భాషల్లో వెలువడి పాఠకులను ఉర్రూతలూగించిన ఏకైక నవల.

డాక్టర్ తులసీకృష్ణ - సింహప్రసాద్ 9·00
(జనసుధ పత్రికలో సీరియల్ అయిన మేటి నవల)

కలకాలం నిలిచేది - శ్రీమతి విమలారామం 10·50
(కుహనసంస్కారానికి వాస్తవమైన సంస్కారానికి జరుగుతున్న అంతః సంఘర్షణే ఈ నవల శ్రీమతి విమలారామం అపూర్వసృష్టి)

మీకు కావలసిన పుస్తకాల ధరలో రూ॥ 1·00 తగ్గించి M.O. చేసిన ఆ రూపాయికి V.P.P.లో పంపగలము

శ్రీ కవితా పబ్లికేషన్స * మ్యూజియం రోడ్డు, విజయవాడ-2